ఫటా ఫట్?



గోకులం షెడ్ల పురోగతిపై దృష్టి

● పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పడిన వర్షాలతో పశువులు అనేక రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్నాయి.పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం తల పెట్టిన గోకులం షెడ్ల నిర్మాణంలో క్షేత్రస్థాయి సిబ్బంది అలస త్వంతో ఆశించిన పురోగతి లేదు.ఈ విషయాలపై పశుసంవ ర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ స్పందన...

? గోకులం షెడ్ల నిర్మాణంలో పురోగతి

! జిల్లాకు 2131 షెడ్లు మంజూరు కాగా, 1981 గ్రౌండింగ్ చేశాం. ఇందులో 166 పూర్తి చేయగా, మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ఇందుకు జిల్లాకు రూ.50 కోట్ల నిధులు వచ్చాయి. షెడ్ల నిర్మాణాలపై తరచూ పర్యవేక్షిస్తున్నాం. పాడి రైతులతో మాట్లాడి నిర్మాణాల్లో వేగం పెంచుతాం.

? ఇటీవలి వర్షాలతో పశువులకు వ్యాధులు ప్రబలాయి

! గొర్రెలు, మేకల్లో చిటుకు వ్యాధితో అబార్షన్ అవుతుంది. దీని నివారణకు తరచూ పర్యవేక్షిస్తున్నాం. పశువుల్లో తరచూ వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ఇప్పటికే ఒక విడత టీకాలు వేశాం. మరోసారి వచ్చే ఏడాది త్రైమాసికంలో వేస్తాం.ఎక్కడైనా ముద్ద చర్మ వ్యాధిని గుర్తించగానే, ఇతర పశువులకు సోకకుండా కట్టడి చేసున్నాం.

? గొర్రెల పెంపకందారుల సంఘాలకు అందుతున్న ప్రయోజనాలు

! సంఘాలకు అవసరమైన మేరకు గొర్రెల భద్రత కోసం షెడ్ల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నాం. జిల్లాలో 73 షెడ్లు మంజూరు కాగా 71 గ్రౌండింగ్ చేశాం. అవసరమైన మేరకు వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నాం.

? రైతుల ఇంటి వద్దకు పశువైద్య సేవలు

! జిల్లాలో నియోజకవర్గానికి రెండు యానిమల్ హెల్త్ అంబులెన్స్‌లున్నాయి. ఎక్కడైనా పశువులకు వ్యాధులున్నట్లు రైతులు 1962 నెంబరుకు ఫోన్ చేస్తే, వారి ఇంటి వద్దకు వెళ్లి సేవలందిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో 289మంది యానిమల్ హెల్త్ అసిస్టెంట్లుండగా, తరచూ గ్రామాలతో పాటు కేంద్రాల్లోనూ వైద్య సేవలందిస్తున్నాం.

మధురమలై కొండలో ఏనుగుల మకాం

సోమల,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో గజ బీభత్సాలు ఆగడంలేదు. ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నంచెరువు సమీప పొలాల్లోని మధురమలై కొండలో ఏనుగుల మంద మకాం వేసినట్లు రైతులు తెలిపారు. శనివారం రాత్రి సుబ్రమణ్యం టమోటా, మామిడితోటల్లో సంచరించి పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు తోటల్లోని డ్రిప్ పరికరాలను తొక్కివేసి తీవ్రంగా నష్ట పరిచినట్లు రైతులు తెలిపారు. గురువారం నుంచి పత్రపల్లె, కొత్తూరు, ఇర్లపల్లె వైపు రావడంతో గ్రామస్తులు పొలాల వైపు వెళ్లలేకపోతున్నారు. శుక్రవారం జంట ఏనుగులు వంగసానివారిపల్లె నుంచి ఇరికిపెంట వైపు మళ్లీ నెలుకూరివారిపల్లె, రాశెట్టివారిపల్లె మార్గంలో మధురమలై కొండకు చేరుకున్నాయి.

■ నేడు జాతీయ రైతు దినోత్సవం

టమోటా తోటలో మురళి



ప్రకృతి వ్యవసాయంతో లాభాల పంటలు

నానా కష్టాలు పడి పంట పండిస్తే పెట్టుబడులు కూడా దక్కడం లేదంటూ చాలామంది రైతులు నిరాశతో కాడి కింద పడేస్తున్న తరుణంలో కొద్దిమంది ఆ వ్యవసాయంలోనే లాభాల పంటలు పండిస్తున్నారు. పైగా రసాయనాల వాడకానికి దూరంగా ప్రకృతిసేద్యంతో ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులను జనానికి చేరవేస్తున్నారు.

నాణ్యమైన పంటతో లాభాల బాట

సోమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం అంటే ఇష్టపడే మురళి బీకాం పూర్తి కాగానే వ్యవసాయంపై దృష్టి సారించారు.ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు.సోమల మండలం కరకమందకు చెందిన మురళి పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించేశారు.10ఎకరాల్లో టమోటా, చెరకు, దోస పంటలను విడతల వారీగా సాగు చేయడం మొదలెట్టారు. ప్రతి పంటకు విత్తన శుద్ధి కోసం బీజామృతం, పంట ఎదుగుదలతో పాటు పురుగుల నివారణకు ఘన జీవామృతం, నీమాస్త్రం వంటి కషాయాలను తయారు చేసుకుని వినియోగించారు.తక్కువ వ్యయంతో పాటు అందుబాటులో లభ్యమయ్యే వస్తువులతో ఇవన్నీ తయారు చేసుకుంటున్నారు.పంటల నాణ్యత బాగుండడంతో మంచి ధరలు లభిస్తున్నాయి.ఏటా టమోటాలోనే మురళి రూ.లక్షలు సంపాదిస్తున్నారు. కోలారు,వడ్డీపల్లె, పలమనేరు మార్కెట్లకు టమోటాలను తరలించి మంచి ధర పొందుతున్నారు. సేంద్రియ ఉత్పత్తులతో మన ఆరోగ్యానికి భరోసాగా వుంటుందంటున్నారు.

అభ్యుదయ రైతు హరికృష్ణ



పెనుమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా గోఆధారిత వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు వనపల హరికృష్ణారెడ్డి. పెనుమూరు మండలం దాసరపల్లెకు చెందిన హరికృష్ణారెడ్డి తన మూడెకరాల పొలంలో జామ, నేరేడు, నిమ్మ, సపోటా, మామిడి, అరటి పంటలను సాగు చేస్తున్నారు.మరోవైపు దేవీ వరి వంగడాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు.రైతు సాధికార సంస్థలో చిరుద్యోగిగా కొనసాగుతూనే పది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులో పంటలు పండిస్తున్నారు.దేశీయ ఆవులు పట్టుకుని బీజామృతం, జీవామృతం, ఆచ్ఛాదన, వాపన వంటి ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. జామసాగులో పేరుమోసిన హరికృష్ణారెడ్డి చందన మాధురి అనే రకం సాగు చేస్తూ ఎకరానికి 15 నుంచి 20 టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు.చిరుధాన్యాలు పండించి అత్యధిక ఆదాయం పొందుతున్నారు. పండించిన పంటలను మద్రాసు, బెంగళూరు, హైదరాబాదు, నంద్యాల, కడప, నెల్లూరు వంటి నగరాలకు పంపి మార్కెట్ చేసుకోగలుగుతున్నారు.వ్యవసాయంలో రసాయన ఎరువులు,మందులు, కలుపు మందుల వాడకం తగ్గించేందుకు వివిధ సంస్థలతో కలిసి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని, గో ఆధారిత వ్యవసాయ పద్ధతులను విద్యార్థులకు, మహిళా సంఘాలకు, రైతులకు నేర్పిస్తున్నారు.ఇందు కోసం పులిగుంటీశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశారు. హరికృష్ణారెడ్డి కృషిని గుర్తించిన లయన్స్ క్లబ్, జిల్లా ఉద్యానశాఖ, జిల్లా వ్యవసాయశాఖ, రైతునేస్తం ఫౌండేషన్ ఆయనకు పురస్కారాలు అందించాయి.



ప్రకృతి సాగులో పండిన జామ



సిరులు కురిపిస్తున్న తైవాన్

పెద్దపంజాణి,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):పెద్దపంజాణి మండలంలోని లింగాపురం వద్ద సాగవుతున్న తైవాన్ రకం జామ పంట సిరులు కురిపిస్తోంది. పలమనేరుకు చెందిన డాక్టర్ బలరాం కుటుంబం లింగాపురం వద్ద తమ పొలంలో ప్రయోగాత్మకంగా తైవాన్ రకం జామను సాగు చేయిస్తోంది.వారి తరఫున పని చేస్తున్న మునిరాజు దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగు చేశాడు. కర్ణాటక రాష్ట్రం నుంచి వంగడాన్ని తెప్పించారు. ఎకరానికి దాదాపు వెయ్యి మొక్కల వంతున 4500మొక్కలను పెంచుతున్నారు. ఒక్కో మొక్క వంద రూపాయలతో కొనుగోలు చేసిన ఈ తైవాన్ రకం జామ మొక్కలు నాటిన ఆరు నెలలకు కాయలు కాస్తాయి.దాదాపు ఏడాది పొడవునా కాయలు కాస్తూనే ఉంటాయని మునిరాజ చెప్పారు. మొక్కలు నాటిన మొదటి ఏడాదిలోనే దాదాపు రూ 15 లక్షలకు పైగా ఆదాయం వచ్చిందన్నారు.దాదాపు 12 ఏళ్ళపాటు కాయలు కాస్తాయన్నారు. కోసిన కాయలను వ్యాపారులు తోటవద్దకే వచ్చి తీసుకుపోతుంటారని, లేని పక్షంలో పలమనేరు, కోలారు, బెంగళూరు, చెన్నై, విజయవాడ మార్కెట్లకు తరలిస్తుంటామన్నారు.ఎటువంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకునే ఈ పంట ధరలు కూడా నిలకడగా ఉంటాయన్నారు.

జామ తోటలో మునిరాజు



మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో టీచర్లకు ఆదివారం చిత్తూరులో డీఈవో వరలక్ష్మి పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. నాలుగు హెచ్‌ఎం పోస్టులకు గాను 20 మంది సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు. వీరి ధ్రువీకరణ పత్రాలు పరీక్షించిన అనంతరం మున్సిపల్ పాఠశాలల్లో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లకు, కార్పొరేషన్ పాఠశాలల్లోని మరో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి పత్రాలు అందజేశారు. కాగా సోమవారం స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఎస్జీటీలకు కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. మున్సిపాలిటీ పాఠశాలల్లో ఎస్ఏ మ్యాథ్స్, ఫిజిక్స్, కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్ఏ ఇంగ్లీషు-4, మ్యాథ్స్(తెలుగు)-2, బయాలజీ(తెలుగు)-7, ఫిజిక్స్ (తెలుగు), సోషియల్(తెలుగు), పీడీ ఒక్కో పోస్టును సీనియారిటీ కింద ఎస్జీటీలకు పదోన్నతి కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేశారు. ఇందుకోసం 42 మంది ఎస్జీటీలు కౌన్సెలింగ్‌కు హాజరవుతారని డీఈవో తెలిపారు.



టీచరుకు పదోన్నతి పత్రం అందజేస్తున్న డీఈవో వరలక్ష్మి

చెల్దిగానిపల్లెలో జరిగిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో భువనేశ్వరి



మహిళల వెన్నుతట్టి.. అసహాయులకు చేయూతనిచ్చి!

● కుప్పం అభివృద్ధికి భువనేశ్వరి హామీ

● విజయవంతంగా ముగిసిన పర్యటన



కుప్పం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో జరిపిన నాలుగు రోజుల పర్యటన విజయవంతమైంది. ఈనెల 19వ తేదీన శాంతిపురం మండలం కడపల్లె వద్ద సొంత ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి, కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మమేకమై, గుడుపల్లె మండలం నలగాంపల్లెలో మహిళలతో ముఖాముఖితో ప్రారంభమైన భువనేశ్వరి పర్యటన, కుప్పం , రామకుప్పం, శాంతిపురం మండలాలమీదుగా సాగి, ఆదివారం నాడు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో మహిళలతో ముఖాముఖితో ముగిసింది. ఇక్కడినుంచి పలమనేరు నియోజకవర్గం వి.కోటకు చేరుకుని, అక్కడ ఎన్టీఆర్ సుజల ప్లాంటు పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్నాక, బెంగళూరుకు అక్కడినుంచి హైదరాబాదుకు పయనమై వెళ్లారు.

ముఖ్యమంత్రి సతీమణిగానో లేదా రాజకీయంగానో తాను ఇక్కడికి రాలేదన్న భువనేశ్వరి తొలుత చెప్పినట్లుగానే ఎన్టీఆర్ ట్రస్టు కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. కుప్పంలో ట్రస్టు తరఫున నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను విస్తరించారు. దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, చిరు వ్యాపారులకు తోపుడు బళ్ల వితరణ చేశారు. ఇంకా ట్రస్టు కార్యక్రమాలను విస్తరిస్తామని, కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ప్రారంభిస్తామని చెప్పారు. ఇక అక్కడినుంచి నాలుగు మండలాలతోపాటు కుప్పం మున్సిపాలిటీలో కూడా మహిళలతోను, డ్వాక్రా సంఘాలతోను ముఖాముఖిలో పాల్గొన్నారు. వారి సాదకబాధకాలు విని, తీరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తరఫున హామీ ఇచ్చారు. కేవలం కుప్పం నియోజకవర్గంలోనే ఏకంగా 40 రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం అరాచక పాలన సాగించి, నియోజకవర్గ ప్రజలను దోచి తమ జేబులు నింపుకున్నదని విమర్శలు చేయడమే కాదు, వచ్చే అయిదేళ్లలో అంతకంతా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా శక్తిని ప్రవచించి

టీడీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లో కుప్పంలో జరిగిన అభివృద్ధి, ఇక మీదట జరగబోయే అభివృద్ధిని ప్రస్తావిస్తూనే, భువనేశ్వరి తన ప్రసంగంలో ఎక్కువగా మహిళలను ఉత్తేజితం చేశారు. ఎవరిలోని శక్తి వారే గుర్తించాలని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సాధ్యం కానిది ఏదీ లేదని వెన్నుతట్టారు.ప్రభుత్వం తరఫున, ఎన్టీఆర్ ట్రస్టు తరఫున కూడా మహిళలకు మరింత చేయూత లభిస్తుందని భరోసా ఇచ్చారు. కాబట్టే భువనేశ్వరికి అడుగడుగునా మహిళలనుంచి ఘన నీరాజనాలు లభించాయి.కుప్పానికి సహాయ సహకారాలు అందిస్తున్న ఆమెపై ప్రజల్లో అభిమానం వెల్లువెత్తింది. భువనేశ్వరి కూడా నియోజకవర్గ స్థాయిలోని అగ్ర నాయకత్వానికంటే ఎక్కువగా మహిళలకే తన పర్యటనలో ప్రాధాన్యమిచ్చారు. రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో ఆదివారం జరిగిన సభలో అయితే వేదిక మీద మొత్తం మహిళలే నిండిపోయారు. ఇలా మహిళలు ముందుకు వచ్చి జీవితాల్లో విజయాలు సాధించాలని భువనేశ్వరి వారికి పిలుపునిచ్చారు. ఎవరికి ఏ సహాయం కావాల్సి వచ్చినా తానున్నానంటూ భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు, తెలుగు మహిళలు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎంహెచ్‌వోగా సుధారాణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభావతిదేవిని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు అడిషనల్ డీఎంహెచ్‌వోగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. సుధారాణికి అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



డీఎంహెచ్‌వో సుధారాణిని పుష్పగుచ్ఛంతో ఆహ్వానిస్తున్న వెంకటప్రసాద్

క్లిక్ చేస్తే ...

● డాక్యుమెంట్ నకళ్ళు ప్రత్యక్షం

● ఈసీలు, సీసీలతో పాటు మరో మూడు సేవలు లభ్యం

● ఆన్‌లైన్‌లోనే రుసుము చెల్లింపు

● వైసీపీ ప్రభుత్వం ఏకంగా తొలగిస్తే... కూటమి ప్రభుత్వం చేసింది సులభతరం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆస్తి కొనుగోలు, విక్రయం, వీలునామా తదితరాలకు సంబంధించి ఈ పత్రాలే ఆధారం. ఇంత కీలకమైన డాక్యుమెంట్లు, నకళ్ళు, ఈసీ (ఎన్కంబరెన్స్ సర్టిఫికెట్) ల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, మీ-సేవ కేంద్రాల చుట్టూ తిరగడం ఏళ్ళ తరబడిగా చూస్తున్నాం. గతంలో రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్ పోర్టల్ ద్వారా కొనసాగిన ఈ సేవలను వైసీపీ పాలనలో తొలగించింది. తాజాగా కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేస్తోంది. ఇంటర్నెట్ ద్వారా ఈసీ, సీసీ కాపీలను పొందే వెసులుబాటు కల్పించింది. ఇందుకు సర్వర్ కష్టాలు లేకుండా కొత్త ఆప్షన్లను తాజాగా సిద్ధం చేశారు. ఆన్‌లైన్‌లోనే రుసుము చెల్లించి తక్షణం ఈసీ, సీసీ కాపీలను తీసుకోవచ్చు.

రుసుము చెల్లింపు ఇలా ...

● ఈసీ, సీసీ డాక్యుమెంట్ కాపీకి రూ.320

● ఈసీ 30ఏళ్ళ పైబడిన సమాచారంతో కావాలంటే రూ.600

● 30ఏళ్ళలోపు ఈసీ సమాచారానికి రూ.300 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది.

● జిల్లాలో బంగారుపాళ్యం, కుప్పం, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు (ఆర్వో), కార్వేటినగరం, నగరి, చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. 697 పంచాయతీల పరిధిలో 612 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రజలకు సులభతరమైన సేవలు అందించేందుకు ఇంటర్నెట్ ద్వారా ఈసీ, సీసీ, ఇతర డాక్యుమెంట్లను పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ విధానంలో సర్వర్ సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పొందే సేవలు ఇవే...

● http://registration.ap.gov.in పోర్టల్ ద్వారా ఈసీ, సీసీ, పబ్లిక్ డేటా ఎంట్రీ, స్టాంప్ ఇండెంట్, ఎంపీ అసిస్టెన్స్ సేవలు కూడా పొందవచ్చు. పోర్టల్‌లో కుడి వైపు వున్న ఈసీ, సీసీ సెర్చ్ ఆప్షన్‌పై క్లిక్ చేయగానే సంబంధిత సేవల పేజీ వస్తుంది. దానిపై ఈసీ ఇన్ఫర్మేషన్, ఈసీ సైన్డ్, సీసీ ఆప్షన్లు కనిపిస్తాయి. రిజిస్ట్రార్ సంతకం లేకుండా ఈసీ కావాలంటే తొలి ఆప్షన్‌పై క్లిక్ చేసి పేరు, చిరునామా, డాక్యుమెంట్ నెంబరు, రిజిస్ట్రేషన్ చేసిన సంవత్సరం నమోదు చేస్తే ఎలాంటి రుసుము లేకుండా ఇన్ఫర్మేషన్ ఈసీ వస్తుంది.

● సైన్డ్ ఈసీ, సీసీ కావాలంటే రెండు లేదా ఆప్షన్‌పై క్లిక్ చేస్తే వచ్చిన ఆప్షన్‌లో మెయిల్ ఐడీ, సెల్, ఫోన్, ఆధార్ సంఖ్యలను నమోదు చేయాలి. లాగిన్ కాగానే ఓటీపీ నమోదు చేసి సబ్మిట్ చేస్తే ఈసీ, సీసీ ఆప్షన్లు కనిపిస్తాయి. మనకు అవసరమైన ఆప్షన్‌పై క్లిక్‌చేసి డాక్యుమెంట్ నెంబరు, రిజిస్ట్రేషన్ సంవత్సరం, రిజిస్ట్రార్ కార్యాలయం చిరునామా, పేరు, అడిగిన వివరాలను నిక్షిప్తంచేసి సబ్మిట్ చేయాలి. ● ఈ ప్రక్రియ తర్వాత ఆన్‌లైన్‌లో రుసుము చెల్లిస్తే యూజర్ లాగిన్‌తో డాక్యుమెంట్ ఫైల్ కనబడుతుంది. రిజిస్ట్రార్ సంతకం ఉన్న ఈసీ కాపీని కూడా ఇదే తరహాలో పొందవచ్చు.





చెరువులో అక్రమ నిర్మాణాలు - ఎద్దులచెరువులో మట్టి తోలి చేపడుతున్న నిర్మాణం



పలమనేరును ఆనుకొని ఉన్న ఎద్దులచెరువు

చెరువును మింగిన చేపలు..!

- ఎద్దులచెరువులో అక్రమ నిర్మాణాల జోరు
- రోజురోజుకూ కుదించుకుపోతున్న విస్తీర్ణం
- కనుమరుగైన ఆయకట్టు రాజాకాలువ

పలమనేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరుకు ఆనుకుని తూర్పువైపున ఉన్న ఎద్దులచెరువు యథేచ్ఛగా కబ్జాకు గురవుతోంది.. రోజురోజుకూ ఆక్రమణలతో చెరువు కుదించుకుపోతోంది. అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ చెరువు నిండి కలుజు పారితే ఆ నీరు పలమనేరుకు పడమర వైపు ఉన్న పెద్దచెరువుకు చేరుతుంది. ఇలా కలుజు నీరు వెళ్లేందుకు ఎద్దులచెరువు కట్ట నుంచి పెద్దచెరువు వరకు ఆయకట్టులో ఉన్న రాజకాలువ నేడు పూర్తిగా కనుమరుగైపోయింది. దాదాపు 10 అడుగుల వెడల్పు ఉన్న రాజకాలువను ఆయకట్టుదారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు.. తమ లేఅవుట్ల వద్ద ఆక్రమించేశారు. ప్రస్తుతం దాదాపు 60 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఎద్దుల చెరువులో ఆక్రమణలు పెరిగిపోయి రోజురోజుకూ కుదించుకుపోతోంది. పలమనేరు జాతీయ రహదారిపై ఉన్నందున ఇక్కడ నివేశ స్థలాలకు మంచి గిరాకీ పెరిగింది. ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల పట్టణానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నందున పలువురు చెరువుల్లో మట్టితోలి ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువు నిండి కలుజు పారే కాలువలు సైతం ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేసేస్తున్నారు. అయితే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు విస్తుపోతున్నారు. పంట కాలువలను సైతం ఆక్రమించుకొని నిర్మాణాలు చేడపతున్నారు. అలాగే పలువురు ఈ చెరువు కట్టపై వ్యర్థాలను పడేస్తున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు ఆ చెత్తను తొలగించడంతో పాటు వ్యర్థాల మట్టిని కట్ట నుంచి చెరువులోకి తోసేస్తున్నారు. దీంతో చెరువు కట్టవద్ద కుదించుకుపోతోంది. ఇకనైనా అధికారులు ఎద్దుల చెరువును పూర్తిగా సర్వే చేయించి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.





చెరువు ఉత్తరం వైపు కలుజు వద్ద నిర్మాణాలు - చెరువు దక్షిణం వైపు కలుజు ఆక్రమణ

ఖోఖో పోటీల్లో చిత్తూరు జట్లకు రెండో స్థానం





చిత్తూరు బాలురు రన్నర్స్ - చిత్తూరు బాలికలు రన్నర్స్

పుత్తూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 19 ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా బాలుర, బాలికల జట్లు విజేతలుగా నిలవగా, చిత్తూరు జిల్లా బాలుర, బాలికల జట్లు రెండో స్థానంలో నిలిచాయి.మూడు రోజుల క్రితం 68వ రాష్ట్రస్థాయి పోటీలు ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమై ఆదివారం ముగిశాయి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ఎమ్మెల్యే గాలి భనుప్రకాష్ ట్రోఫీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని, క్రీడా కోటాను కూడా మూడు శాతానికి పెంచారని గుర్తు చేశారు. కాగా ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ప్రకాశం జిల్లా బాలికల జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై 14-12 స్కోరుతో విజయం సాధించింది. అలాగే ప్రకాశం జిల్లా బాలుర జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై 12-10 స్కోరుతో గెలుపొందింది. దీంతో బాలుర, బాలిక విభాగాల్లో ప్రకాశం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఈ బహుమతి ప్రదానంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, నాయకులు యుగంధర్, ధనపాల్, జనసేన నాయకుడు మహేష్, క్రీడా నిర్వాహకులు జయరామయ్య, బాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై విజి'లెన్స్'



- ముమ్మరంగా దర్యాప్తు
- రెండు ప్రాంతాల్లోనే రూ.4.56 కోట్ల అవినీతి జరిగినట్లు అంచనా

జగనన్న కాలనీల్లో అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. 5వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్న రెండు ప్రాంతాల్లోనే ఇప్పటికి రూ.4.56 కోట్ల అవినీతి జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిపై విజిలెన్సు డీజీ హరీష్‌కుమార్ గుప్తాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆయన విచారణకు ఆదేశించారు. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో మూడు బృందాలు తనిఖీలు చేస్తున్నాయి.

ఏర్పేడు మండలం చిందేపల్లి, చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లి ప్రాంతాల్లో నిర్మించదలచిన దాదాపు 5000 జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం థర్డ్ ఆప్షన్ కింద ఓ కంపెనీకి కట్టబెట్టింది. ఒక్కో ఇంటికి రూ1.80లక్షలు మంజూరు చేసింది. ఇందులోనే సిమెంటు, కమ్మీ, ఇతర ముడిపదార్థాలను నేరుగా హౌసింగ్ శాఖ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇక్కడ్నుంచే కొందరు అక్రమాలకు తెరతీసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఫిర్యాదులపై విజిలెన్సు విచారణ చేపట్టింది. చిందేపల్లిలో నిర్మించదలచిన దాదాపు 3500 గృహాల్లో పూర్తి కానివి దాదాపు 80 శాతం వరకున్నాయి. వీటిలో పునాది దశ దాటని ఇళ్లకు, పునాదులు పూర్తయినట్లు ఎం.బుక్కుల్లో నమోదు చేసి నిధులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి. అలాగే గోడలు నిర్మించిన దశలో దాదాపు 800 ఇళ్లు ఉండగా వాటికి మోల్డింగ్ పూర్తయినట్లు లెక్కలు చూపినట్లు అధికారుల తనిఖీల్లో తెలిసిందని సమాచారం. పునాది పడని ఇళ్లకూ పినట్లు ఎం.బుక్కులు నమోదైనట్లు సమాచారం. ఇక, ఎం.కొత్తపల్లిలో నిర్మించదలచిన 1500 ఇళ్లలో కనీసం 60 శాతం ఇళ్లు కూడా పూర్తికాకనే బిల్లులు రాసుకున్నట్లు.. చాలా ఇళ్లు పూర్తికాకున్నా పూర్తయినట్లు ఎం.బుక్కులు నమోదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో ఇంటికి 100 బస్తాల సిమెంటు ఇవ్వాల్సి ఉండగా, 40 నుంచి 45 మాత్రమే ఇచ్చి పూర్తిగా ఇచ్చినట్లు.. పునాది దశలో ఉన్న ఇళ్లకు గోడలు దశ పూర్తయిందని.. ఇక, మోల్డింగ్‌కు దాదాపు 2500 ఇళ్లు ఉన్నాయని లెక్కలు చూపి నిధులు పక్కదారి పట్టినట్లు విజిలెన్సు అధికారులు తనిఖీల్లో బయటపడినట్లు తెలుస్తోంది. ఇలా దాదాపు రూ.4.56 కోట్లు దుర్వినియోగమైనట్లు ఇప్పటి వరకున్న సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ఈ అక్రమాల వెనుక ఎవరెవరున్నారనే దిశగానూ దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. మరో వారం రోజుల్లో ప్రభుత్వానికి విచారణ నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు

పార్టీలో గుర్తింపు లేదన్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి

వెదురుకుప్పం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు ముదిరిపాకాన పడ్డాయి.నల్లవెంగనపల్లె ఎంపీటీసీ సభ్యురాలు సుజాత రాజీనామా చేస్తారన్న ప్రచారం ఆదివారం మండలంలో జోరుగా సాగింది.పార్టీ ఆవిర్భావం నుంచి సుమారు రెండేళ్ల క్రితం వరకు వెదురుకుప్పం మండల పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శి హోదాలో ఉన్న పేట ధనంజయులురెడ్డి తనకు, తన భార్య అయిన నల్లవెంగనపల్లె ఎంపీటీసీ సుజాతకు పార్టీలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం వెదురుకుప్పం మండలంలో జరిగిన జగన్ పుట్టిన రోజు వేడుకలకు తనకు పిలుపు అందలేదని ధనంజయ రెడ్డి తెలిపారు.నల్లవెంగనపల్లె సెగ్మెంట్‌లో పార్టీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి హాజరైన కార్యక్రమానికి కూడా ఎంపీటీసీ సభ్యురాలికి సమాచారం ఇవ్వలేదన్నారు.పార్టీలో కష్టపడే వారికి విలువ లేదని 'షో' రాజకీయాలు చేసే వారికే ప్రాధాన్యం వుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ఎంపీటీసీ పదవికి సుజాత రాజీనామా చేస్తారని ఆదివారం విస్తృత ప్రచారం జరిగింది. రాన్రానూ ఈ రాజకీయ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయో వేచి చూడాల్సివుంది.

ఒకే నెంబరుతో రెండు వాహనాలు

పోలీసుల తనిఖీలో బట్టబయలు



ఒకే నంబరుతో ఉన్న రెండు వాహనాలను చూపిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

వెదురుకుప్పం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒకే రిజిస్ట్రేషన్ నెంబరుతో రెండు టాటాఏస్ వాహనాలు లగేజీ తరలిస్తూ ఆదివారం పోలీసులకు పట్టుబడ్డాయి. కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.....చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలోని కార్వేటినగరం మండలం అమ్మపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఎస్ఐ వాహనాలను తనిఖీ చేశారు.రెండు టాటాఏస్ గూడ్స్ క్యారియర్ వాహనాలు రాగా తనిఖీ చేశారు. ఆ రెండింటికీ ఒకే రిజిస్ట్రేషన్ నెంబరు ఉంది. క్షుణ్ణంగా పరిశీలించడంతో ఒకే నంబరుతో రెండు వాహనాలను లగేజీ తరలించేందుకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఏపీ04వీ5035తో రిజిస్ట్రేషన్ నెంబర్లను రెండు వాహనాలకు అతికించి ఉన్నారు. రికార్డులు లేవు. దీంతో రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని కార్వేటినగరం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ వాహనాలు కార్వేటినగరం మండలం ఈదులవారిపల్లికి చెందిన ఎ.హేమకుమార్‌విగా గుర్తించారు. తదుపరి చర్యల నిమిత్తం నగరి మోటారు వాహనాల అధికారికి లేఖ రాసినట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.44 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,411
తలనీలాలు సమర్పించినవారు: 27,677

కువైట్‌లో శ్రీకాళహస్తి మహిళ ఆవేదన

బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైట్‌కు వెళ్లిన మహిళకు కష్టాలు మిగిలాయి.గొడ్డు చాకిరీ చేసినా కనికరంలేదు. కడుపునిండా తిండిలేదు. కంటినిండా కునుకు లేదు. ఒక్క పూట భోజనం, గ్లాసు మంచినీళ్లతో మూత్రంలో రక్తస్రావమవుతూ నరకం అనుభవిస్తోంది శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ.

నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- మూత్రంలో రక్తం వస్తోంది
- ప్రతిక్షణం నరకం అనుభవిస్తున్నా



లక్ష్మి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం రాజీవ్ నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి ఆర్థిక ఇబ్బందులతో బిడ్డల చదువుకోసమని కువైట్‌కు వెళ్లారు. అక్కడ ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను సెల్ఫీ వీడియోలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'నా పేరు లక్ష్మి. కువైట్‌లో ఇరుక్కుపోయాను. రూ2.5లక్షలు కడితేనే ఇండియాకు పంపుతామంటున్నారు. ఘోరంగా కొడుతున్నారు. ఏజెంట్ దగ్గరకు వెళ్లి చెబితే ఇక్కడే నిన్ను చంపి ఎడారిలో వేసేస్తాం అని బెదిరిస్తున్నారు. నా ఆరోగ్యం సహకరించడంలేదు. మూత్రానికి బదులు రక్తం వస్తోంది. ఇంటికి ఫోన్ చేసుకునే అవకాశం ఇవ్వడంలేదు. బయటకు రాకుండా బీగాలు వేసేశారు. నన్ను ఎలాగైనా ఇండియాకు పంపండి' అని సెల్ఫీ వీడియో ద్వారా లక్ష్మి వేడుకున్నారు.

తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం

శ్రీకాళహస్తికి చెందిన లక్ష్మిని ఇండియాకు పంపే ప్రయత్నం చేస్తున్నాం. ఆమె కువైట్‌లో ఇబ్బందులు పడుతున్నట్టు మాదృష్టికి వచ్చింది. ఏజెంట్లతో మాట్లాడుతున్నాం. రూ2.5లక్షలు అడుగుతున్నారు. తెలుగు ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంటున్నాం.

- డాక్టర్ ముక్కు తులసీకుమార్, ఏపీఎన్ఆర్టీ యూఏఈ మాజీ ఇంచార్జి

మా అమ్మను రప్పించండి సారూ..

కువైట్‌లో నరకయాతన అనుభవిస్తున్న తమ అమ్మను తీసుకురావాలని సుచిత్ర కన్నీటి పర్యంతమవుతోంది. తన తల్లి పడుతున్న కష్టాలు చూసి తల్లడిల్లుతోంది. ఎలాగైనా ఆమెను తమ వద్దకు చేర్చాలని అధికారులను వేడుకుంటోంది. 'మా చదవుల కోసమని పీలేరులోని శ్రీనివాసులు అనే ఏజెంట్ సహకారంతో కువైట్‌కు వెళ్లింది. అతడు కుమారి అనే కువైట్ ఏజెంట్‌కు మా అమ్మను అప్పజెప్పారు. ఆమె రెండిళ్లలో పనికి కుదర్చింది. ఎంత పనిచేస్తున్నా చేయడంలేదని హింసిస్తున్నారు. అక్కడ ఉండలేమని ఇండియాకు వెళ్లిపోతామని మా అమ్మ ఏజెంట్ దగ్గరకు వెళ్లారు. ఏజెంట్ లేని సమయంలో నాకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు' అంటూ సుచిత్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



నేడు కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గ, మండల స్థాయిల్లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులంతా విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో...

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలిండియా ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపతి



మంగళం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.లక్ష్మీపతి ఆలిండియా ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన అఖిల భారత అటవీ అధికారుల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. జాతీయ జాయింట్ కార్యదర్శిగా పరమేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే దేశం, ఒకే పని, ఒకే వేతనం, ఒకే యూనిఫాం నినాదంతో ప్రభుత్వానికి సమస్యలను విన్నవించనున్నట్లు లక్ష్మీపతి తెలిపారు.

దివ్యాంగులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పరికరాలు పొందాలని.. ఇందుకోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కోరారు. గుర్తించిన లబ్ధిదారులకు రానున్న మూడు నెలల్లో సహాయ పరికరాలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆదివారం పలమనేరు బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన దివ్యాంగుల గుర్తింపు శిబిరంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఈ శిబిరంలో నమోదు చేసుకోవడంతో వారికి అవసరమైన వినికిడి యంత్రాలు, కళ్లద్దాలు, కృత్రిమ చేతులు, కాళ్లు, మూడు చక్రాల సైకిళ్లు, మోటారు వాహనాలు అందజేస్తారని పేర్కొన్నారు. శిబిరంలో దివ్యాంగులు పొందే సర్టిఫికెట్ల ఆధారంగా ఇప్పటి వరకు పెన్షన్ పొందని వారికి ప్రభుత్వం పెన్షన్ అందజేసేందుకు చర్యలు తీసుకొంటుందన్నారు. శిబిరంలో ఏడీ వై.శ్రీనివాస్ మాట్లాడుతూ శిబిరానికి 861 మంది హాజరు కాగా.. అందులో 835 మంది వివిధ రకాల పరికరాలకు అర్హులన్నారు. ఈనెల 23 సోమవారం కుప్పం ఆర్టీసీ బస్టాండు వద్ద రాజావారి పార్కులో, 24న రామకుప్పం జడ్పీ హైస్కూల్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులను పరీక్షించి ఎంపిక చేసేందుకు ప్రత్యేక గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో పి.భవాని, మున్సిపల్ కమిషనర్ ఎంవీ రమణారెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

పలమనేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువకల్లాడు, దిగువకల్లాడు, ఎం.కల్లాడు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇందూ జ్ఞానవేదిక సభ్యులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ ఆచార్య ప్రబోధానందయోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంతం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక పలమనేరు, బంగారుపాళ్యం అధ్యక్షులు భాస్కర్, బాలాజీలతోపాటు సభ్యులు ఉదయ్, రేఖ,కళ్యాణి, జీవరత్న, వాణిశ్రీ, జ్యోతి, రెడ్డెమ్మ, రాజేంద్ర, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



బోయకొండ గంగమ్మ, అమ్మవారి దర్శనం కోసం వేచియున్న భక్తులు

చౌడేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

5న హైందవ శంఖారావం



సోమలలో మాట్లాడుతున్న పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు

చౌడేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ కార్యకర్త గందోడి ప్రవీణ్ అన్నారు. ఆదివారం ఆయన చౌడేపల్లెలో హైందవ శంఖారావం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్త శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

●సోమల: విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేసేందుకు సోమల మండలం నుంచి అధిక సంఖ్యలో హిందువులు తరలి రావాలని పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మండలస్థాయి వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కళాశాల విద్యార్థి ప్రముఖ్ అశోక్, నరసింహారెడ్డి, శివ, సుబ్రహ్మణ్యం, కుమార్, శ్రీధర్, గిరి, గోపిస్వామి, అభిషేక్, మునివెంకటప్ప, హరి, బాలాజీ, నవీన్ రాయల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాలేటమ్మ బోనాల పండుగ



పాలేటమ్మకు దీలు బోనాలతో ఉభయదారులు

సోమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లిమంద సమీపంలో కొలువుదీరిన పాలేటమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈనేపథ్యంలో ఆలయాన్ని పచ్చని తోరణాలు.. విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేశారు. ఉభయదారులు సోమలకు చెందిన పాయల చంద్రశేఖర్, కళావతి దంపతులు సారె చీరలతో, బోనాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమాల్లో సోమల, ఎగువపల్లె, అడుసుపల్లె, గన్నావారిపల్లె, నెల్లిమంద, తెట్టుపల్లె, కమ్మపల్లె భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక మహోత్సవాలు

పుంగనూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి వద్ద వెలిసిన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ప్రత్యేక కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సోమవారం గణపతి పూజ, అంకురార్పణ, కలశ స్థాపన, మంగళవారం వాస్తుపూజ, హోమం, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం హోమం, కాలభైరవ హోమం, సంప్రోక్షణ, దీపారాధన, బుధవారం శేష హోమం, కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భువనేశ్వరికి సాదర వీడ్కోలు



బెంగళూరులో భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న బెంగళూరు ఫోరం నేతలు

వి.కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల కుప్పం పర్యటన అనంతరం వి.కోట మీదుగా భువనేశ్వరిరోడ్డు మార్గాన ఆదివారం సాయంత్రం బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ బెంగళూరు టీడీపీ ఫోరం నేతలు వీడ్కోలు పలికారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు.ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, పీఈఎస్ కార్యదర్శి పీసీ రత్నప్ప, ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు త్యాగరాజ్, బెంగళూరు టీడీపీ ఫోరం నేతలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

సోమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయి పటేల్ వర్ధంతులను పురస్కరించుకొని ఆదివారం సోమల విద్యావనరుల కేంద్రంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో శివరత్న, సీఆర్పీలు సోమశేఖర్, సురేంద్ర, ఉపాధ్యాయ సంఘనేతలు పాల్గొన్నారు.

శంకరప్ప కుటుంబాన్ని ఆదుకోవాలి : వెంకటేగౌడ

పలమనేరు, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో శనివారం మృతిచెందిన శంకరప్ప కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఏనుగుల దాడులు అరికట్టేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. ఆదివారం ఆయన బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లి గ్రామానికి వెళ్లి ఏనుగుదాడిలో మృతిచెందిన శంకరప్ప భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైసీపీ రాష్ట్రకార్యదర్శి కృష్ణమూర్తి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బాబు పాలనలో మంచి రోజులే..!

● అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం ● చెల్దిగానిపల్లెలో నారా భువనేశ్వరి



చెల్దిగానిపల్లెలో మాట్లాడుతున్న భువనేశ్వరి



సుజల ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి



మహిళలతో మాట్లాడుతున్న భువనేశ్వరి

రామకుప్పం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాబు పాలనలో అంతా మంచి రోజులేనని.. అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఆమె నాలుగు రోజుల పర్యటన ఆదివారంతో ముగిసింది. ఆదివారం రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో మహిళలు, రైతులతో ఆమె ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షాలు పడితే తప్ప పంటలు పండలేని కుప్పం నియోజకవర్గం నుంచి కరవును పారదోలి, సంతోషాల కుప్పంగా తీర్చి దిద్దాలన్నదే ఆయన ధ్యేయమని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలతోపాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎన్నో బాధలు పడ్డారన్నారు. చివరకు చంద్రబాబుపై సైతం అక్రమంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపారన్నారు. ఆ సంఘటన జరిగిన తర్వాత యావత్ తెలుగు జాతి స్పందించిన తీరుకు తాము సర్వదా కృతజ్ఞతా పూర్వకంగా ఉంటామన్నారు. చంద్రబాబు జైలుకెళ్లాక 'నిజం గెలవాలి' నినాదంతో తాను చేపట్టిన పర్యటనలో వైసీపీ రాక్షస పాలనలో ప్రజలు, టీడీపీ శ్రేణులు ఎదుర్కొంటున్న వేధింపులను తెలుసుకున్నానన్నారు. ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి కుప్పంలో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. ప్రభుత్వమే కాకుండా అవసరమైన వారికి ఎన్టీఆర్ ట్రస్టు నుంచి సాయం అందిస్తామన్నారు. చంద్రబాబు రోజూ కుప్పంలో జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకుంటున్నారన్నారు. మహిళలు ఒక శక్తిగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు అంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, రామకృష్ణప్ప, మనోహర్, గంట్లరెడ్డి, గజేంద్ర, సలాంసాబ్, స్థానిక నేతలు సురేష్, రెడ్డిపురుషోత్తం, మునస్వామిశెట్టి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సుజల ప్లాంటు ప్రారంభం

వి.కోట: హెరిటేజ్ రైతు సంక్షేమ నిధితో వి.కోటలో నెలకొల్పిన సుజల వాటర్ ప్లాంటును ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదివారం ప్రారంభించారు. వి.కోట మార్కెట్ యార్డు వద్ద ఆమెకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్ తదితర నేతలు స్వాగతం పలికారు. 2016లో ఏర్పాటు చేసిన ప్లాంటు నిర్వహణ లోపంతో మూతబడింది. చెడిపోయిన యంత్రాలను బాగుచేయించి ఆమెచే పునఃప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో భువనేశ్వరి ప్రసంగించారు. నాలుగు రోజుల కుప్పం పర్యటన తనకు సంతృప్తిని ఇచ్చిందన్నారు. టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు రాంబాబు, చౌడప్ప, సోము, ధీరజ్, శబరీష్, గోపీనాథ్, హరి, గుణ, నాసీర్, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, వెంకట్రామప్ప, పీఎస్ మునిరత్నం, డా.సురేష్, డా.వెంకటేష్, మార్కెట్ కార్యదర్శి సంజీవకుమార్, డీఈ , ఎంపీడీవో ఈశ్వరన్, డీఎస్పీ ప్రభాకర్, సీఐ సోమశేఖర్, ఏపీఎంలు లావణ్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వి.కోటకు తీరని అన్యాయం

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గడచిన వైసీపీ ఐదేళ్ల పాలనలో వి.కోట ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వి.కోట మార్కెట్ యార్డులో నారా భువనేశ్వరితో కలిసి సుజల వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఆయన మాట్లాడారు. వైసీపీ పాలకులు వి.కోట మండలానికి మేలు చేకూర్చే తూర్పు బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను కర్ణాటక మీదుగా మార్చి పొరుగు రాష్ట్రానికి మేలుచేకూర్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో మన సీఎం చంద్రబాబు వాటిని అడ్డుకుని తూర్పు బైపాస్‌కు కేంద్ర మంత్రిత్వశాఖతో సంప్రదించి పనులు ఆగేలా చర్యలు చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వి.కోటలో అర్ధాంతరంగా ఆగిన అభివృద్ధి పనులకు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రూ. 5 కోట్లతో పిల్లర్ల దశలోనే ఆగిన కోల్డ్‌స్టోరేజికి నిధులు కేటాయింపులు జరిగాయని.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. 2016లో బురదమయంగా ఉన్న మార్కెట్‌ను భువనేశ్వరమ్మ రాకతో సీసీ రోడ్డు నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. 30 గదులు నిర్మించి స్థానికులకే కేటాయించి మార్కెట్‌కు అదనపు ఆదాయం వచ్చేలా చేశామన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి తీసుకురావడంతో అటు బెంగళూరు, ఇటు చెన్నై నగరాలకు కేవలం రెండు గంటల వ్యవధిలోనే కూరగాయలు, ఇతర ఉత్పత్తులను చేర్చేందుకు వీలుంటుందన్నారు. మదనపల్లె నుంచి పలమనేరు, కుప్పం మీదుగా కృష్ణగిరి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఏనుగుల సమస్య పరిష్కారానికి చర్యలు

అటవీ సరిహద్దు ప్రాంతాలో రైతులు ఇబ్బంది పడుతున్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవతో 50 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేసి కుంకీ ఏనుగులను తీసుకొచ్చి వాటితో మదపుటేనుగులను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ఏనుగుల వల్ల సమస్య రాకుండా చేస్తామన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కందూరు హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

సోమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరు హైస్కూల్‌లో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పటి గురువులు విశ్వనాథరెడ్డి, పాపిరెడ్డి, దేవేంద్రనాథ్‌రెడ్డి, శ్రీరాములు, మహబూబ్‌బాషా, చిన్నప్ప, పాండురంగయ్య, కువలన్న, రెడ్డెప్ప నాయుడులను సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేశ్, శ్రీకాంత్, రఘునాథ్, సతీష్, కల్పన, రమ్య, సత్యకుమారి, శ్రావ్య తదితరులు పర్యవేక్షించారు.

మఠం నిర్మాణానికి భూమి పూజ

చౌడేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆది శంకరాచార్యుల మఠం నిర్మాణానికి శాస్త్రోక్తంగా బ్రహ్మణ సంఘం సభ్యులు స్థానిక కుమ్మరి వీధి సమీపంలో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మణ సంఘం సభ్యులు రాజశేఖర్ దీక్షితులు, సత్యస్వామి, ఏవీ సుబ్రహ్మణ్యం, వశిష్టాచార్యులు, బాబురాజేంద్ర ప్రసాద్, మల్లిఖార్జున, రఘు, నాయకులు రెడ్డిప్రకాష్, కడియాల రాజన్న జీవన్‌ప్రకాష్, గణేష్ పాల్గొన్నారు.

వరదరాజస్వామికి వెండి హస్తాలు, పాదాలు విరాళం



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయానికి బెంగళూరుకు చెందిన నవీన్‌కుమార్ ఆదివారం వెండి హస్తాలు, పాదాలు విరాళంగా అందించారు. వెండి ఆభరణాలు కేజీ 800 గ్రాముల బరువు కలిగి రూ.185,000 ఖరీదు చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి సికింద్రాబాద్‌కు చెందిన రాజ్యలక్ష్మి రూ.1,01,116 డీడీ రూపంలో అందించారు. విరాళదాతను ఈవో ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానంతరం దాతలను ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పవన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



జనసేన పార్టీలో చేరుతున్న భీమగానిపల్లె గ్రామస్తులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆశయాలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని భీమగానిపల్లె పంచాయతీలోని శాంతినగర్, వెంకటాద్రికాలనీ, రాంపల్లె, గుట్టకిందపల్లె, ఉలవలదిన్నె తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా పాలన సాగుతోందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేశారని, యువతను రాజకీయాల్లోకి తీసుకురావడానికి ప్రముఖ్యత కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం దాదాపు 200 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు జనసేన పార్టీలో చేరారు. సమావేశంలో శికుమార్‌రెడ్డి, విరూపాక్షి, పగడాల రమణ, చిన్నారాయల్, నరేంద్రరెడ్డి, నరేశ్‌రాయల్, జనార్ధన్, హరిప్రసాద్, వెంకటరమణారెడ్డి, రేవంత్, సద్దాం, హరినాయక్, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు క్రీడాకారుల ఎంపిక



కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పుంగనూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ జిల్లా బాలబాలికల జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కేసీ మాధవమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో జిల్లా నలుమూలల నుంచి 47 మంది బాలికలు, 54 మంది బాలురు హాజరయ్యారు. వీరికి కబడ్డీ పోటీలు నిర్వహించగా వారిలో 17 మంది బాలురు, 14 మంది బాలికలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈనెల 25 నుంచి 31 వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 3 నుంచి 5 వరకు కర్నూలులో జరిగే అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారుల ఎంపికలో ఫిజికల్ డైరెక్టర్లు రామచంద్ర, వెంకటేశ్, గంగాధర్, వెంకటరమణగౌడు, శ్రీనివాసులు, మహ్మద్, నవయుగనాథ్, తుంగమంజునాథ్, తిప్పానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం.. విద్యార్థుల కలయిక..!



చౌడేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె హైస్కూల్‌లో 2005-06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. చదువుకున్న స్కూల్‌లోనే ఆత్మీయంగా కలిశారు. అప్పటి గురువులు నాయుని చంద్ర శేఖర్‌మూర్తి, రామ్మూర్తి, భాగ్యమ్మ, రెడ్డెమ్మ, షఫీ, బసవన్నలను సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అందరి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకుంటూ అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

2005-06 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు

పనుల బిల్లుల స్వాహా

రామకుప్పం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రం పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా తాను మురుగు కాలువలను నిర్మిస్తే పనులకు సంబంధించిన బిల్లులు రూ.7.55 లక్షలు స్థానిక ఉపసర్పంచ్ స్వాహా చేశాడని మిట్టపల్లెకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సాంబశివయ్య తెలిపారు. గత మార్చి నెలలో ఈ విషయమై జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందించాడు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం సాంబశివయ్యకు రూ.7.55 లక్షలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చారు. అయితే పంచాయతీ కార్యదర్శి తన సొంత చెక్కును సాంబశివయ్యకు ఇచ్చాడు. అది చెల్లని చెక్కుగా మారింది. తనకు రావాల్సిన బిల్లుకు సంబంధించి డబ్బులను పంచాయతీ కార్యదర్శి తన బ్యాంకు ఖాతాకు జమ చేసుకుని, ఆ తర్వాత ఉపసర్పంచ్ అకౌంటుకు బదిలీ చేశాడని బాధితుడు తెలిపారు. తనకు అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విషయమై ఉపసర్పంచ్ మాట్లాడుతూ సాంబశివయ్యకు రావాల్సిన డబ్బులకు తనకు ఎటువంటి సంబంధం లేదని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు.

కుప్పం ప్రజలకు కృతజ్ఞతలు

కుప్పం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం పర్యటనను విజయవంతం చేసినందుకు కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భువనేశ్వరి కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. డీఎస్సీ కోచింగ్, మహిళలకు శిక్షణ, ఉపకరణాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భువనేశ్వరికి, ఆమెను ఆదరించి విజయవంతం చేసిన ప్రజలకు, కార్యకర్తలకు, ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

నక్కబండలో చోరీ

పుంగనూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నక్కబండలో కాపురం ఉన్న నారాయణమూర్తి ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నక్కబండలోని నారాయణమూర్తి 10 రోజుల క్రితం వైజాక్‌లోని తన కుమార్తె వద్దకు వెళ్లారు. శనివారం రాత్రి ఇంటి తాళాలు ధ్వంసం చేసి బీరువా పగలగొట్టి అందులోని డబ్బులు, బంగారు నగలు చోరీ జరిగినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులు వస్తే ఎంత చోరీ జరిగిందో తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



సదుం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బస్సును బైకు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ షేక్ షావలి కథనం మేరకు.. సదుం దిగువ జాండ్రపేటకు చెందిన వంశీ ఆదివారం సాయంత్రం తన ఇద్దరు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమల వైపు వెళుతుండగా మార్గమధ్యంలో నాగిరెడ్డి చెరుకుకట్ట మలుపు వద్ద ఓ ప్రైవేటు బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో వంశీ కుడి కాలు విరిగింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మంజునాథ్‌కు గురుపురస్కార్



పురస్కారం అందుకుంటున్న మంజునాథ్

రామకుప్పం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పానికి చెందిన మంజునాథ్‌కు గుంటూరుకు చెందిన డా.హనుమంతరావు చారిటబుల్ ట్రస్టు.. సుగుణసైన్స్ అకాడమీ వారి నుంచి గురుపురస్కార్ సత్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు. తమిళనాడు వేలమ్మాళ్ వేల్స్ విద్యాలయంలో తాను ఉపాధ్యాయుడిగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి జాతీయస్థాయిలో వారు ఒలంపియాడ్ పరీక్షలో విశేష ప్రతిభ కనబరిచేలా చేసినందుకు తనకు పురస్కారం లభించిందని పేర్కొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కల్యాణోత్సవం, ఆయుష్ హోమం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మొదటగా గోదాదేవి(ఆండాల్ అమ్మవారి)కి తిరుప్పావై నిర్వహించి, అనంతరం ప్రత్యేకపూజలు చేశారు.

కాణిపాకానికి పోటెత్తిన భక్తులు



ఆలయం వెలుపల స్వామి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వరసిద్ధుడి దర్శనార్థం అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయం వెలుపల వరకు క్యూలైన్లు నిండాయి. దీంతో స్వామి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య తోపులాటలు జరగకుండా అధికారులు పర్యవేక్షించారు. ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కలిగేలా అధికారులు కృషి చేశారు.

క్రీస్తు బోధనలే విశ్వశాంతికి సోపానం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, దొరబాబు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీసస్ బోధనలే విశ్వశాంతికి సోపానమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం ఆయన నగరంలోని కొంగారెడ్డిపల్లె, టౌన్ చర్చి, ఇరువారం చర్చిల్లో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చుడా చైర్మన్ కఠారి హేమలత, నగరపాలక మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం



ఢిల్లీ ప్రసాద్ కుటుంబానికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కల్యాణోత్సవం, ఆయుష్ హోమం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మొదటగా గోదాదేవి(ఆండాల్ అమ్మవారి)కి తిరుప్పావై నిర్వహించి, అనంతరం ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రధానమండపంలో అర్చకులు ఆయుష్ హోమం పూజలు చేశారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడిని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం పూజలుచేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కల్యాణోత్సవం పూజలకు చిత్తూరుకు చెందిన ఢిల్లీప్రసాద్ కుటుంబసభ్యులు, హోమం పూజలకు చెన్నైకి చెందిన రాజు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, భక్తులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలి: బీజేపీ



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును అడ్డంపెట్టుకుని కుటిల రాజకీయాలు చేస్తున్న రాహుల్ గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పిలుపు మేరకు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ పేరుతో అడ్డగోలుగా తమ పబ్బం గడుపుకోవడం కోసం కాంగ్రెస్ కుటిల రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు, నాయకులు బ్రహ్మానందం, నీరజాక్షులు, కన్నయ్య, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి ఎమ్మెల్యే నివాళి



సుజాతమ్మ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబాడలో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ సుజాతమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. కర్మక్రియల సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భాను పరామర్శ

నగరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మిట్టపాళెంలో టీడీపీ సీనియర్ నేత కన్నివేలు తల్లి చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్యే భానుప్రకాష్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నగరి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేష్ నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పవన్ ఆశయాలకనుగుణంగా పనిచేద్దాం



యుగంధర్‌కు సన్మానం

వెదురుకుప్పం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేద్దామని మాల కార్పొరేషన్ మెంబరు, జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న అన్నారు. ఆదివారం వెదురుకుప్పం మండలం మొరవ గ్రామం నుంచి వెదురుకుప్పం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెదురుకుప్పంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ యతీశ్వర్‌రెడ్డి, వెదురుకుప్పం పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం, పార్టీ ఉపాధ్యక్షురాలు రేణుక, సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి, యువ నాయకుడు చందు, నక్కా మధు, నక్కా ముని తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి సారె



భువనేశ్వరికి సారె, చీర ఇస్తున్న చలపతి, లత తదితరులు

నగరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పసుపు, కుంకుమలతో దీర్ఘ సుమంగళిగా వర్ధిల్లాలి భువనమ్మా అంటూ నగరి తెలుగు మహిళలు ఆదివారం కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి చీర, పసుపు, కుంకుమలను అందించారు.నగరి టీడీపీ నేత చలపతి, మాజీ కౌన్సిలర్ లత ఆధ్వర్యంలో తెలుగు మహిళలు భువనేశ్వరిని కలిశారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

బంగారుపాళ్యం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లె కార్నర్ స్టోన్ చర్చి పాస్టర్ శామ్యూల్ ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. తగ్గువారిపల్లె, తిమ్మోజిపల్లె, ముంగరమడుగు, లక్ష్మీపురం, వెంకటగిరి వీధుల్లో ప్రార్థన గీతాలు ఆలపించారు. మాధవనగర్ లోని బ్లెస్సింగ్ చర్చిలో పాస్టర్ కిరణ్, పాస్టర్ యోహాన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

అబాకస్ ఇంటర్నేషనల్ పోటీల్లో వైషు ప్రతిభ



కప్ అందుకున్న వైషు

చితూరు సెంట్రల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన యాసీమాస్ అబాకస్ ఇంటర్నేషనల్ పోటీల్లో స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్న ఎస్.వైషు ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీ సాధించినట్లు షకీనా ప్రైయర్ హౌస్ రెవరెండ్ జోబ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన చిన్నారిని క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చర్చిలో పలువురు అభినందించి సన్మానించారు.

ఆవలకొండలో కార్డన్‌సెర్చ్

● రికార్డుల్లేని 28 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన ద్విచక్ర వాహనాలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి, రికార్డుల్లేని 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ద్విచక్ర వాహనాలను కొంతమంది ఇక్కడ తిప్పుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం తెల్లవారు జామున ఆవలకొండ గ్రామంలోని పలుఇళ్లల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 28 ద్విచక్ర వాహనాలకు రికార్డులు సక్రమంగా లేనట్లు గుర్తించి, వాటిని గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ పేర్కొన్నారు.

చెరువుకు వచ్చే కాల్వలను బాగుచేయండి



థామస్‌ను సన్మానిస్తున్న కేశవ మొదలి, విక్రమ్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం వల్ల నీరు మొత్తం వ్యవసాయ పొలాలపై పడి భూములు కోతకు గురవుతున్నాయని ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్‌కు గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రంకు చెందిన కేశవమొదలి, ఆయన కుమారుడు విక్రమ్, సురేష్‌లు విన్నవించారు. చెన్నైలో థామస్‌ను ఆదివారం కలిసిన వారు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. తూగుండ్రం చెరువుకు వచ్చే వేర్వేరు కాల్వలు పూడిపోయాయని, వర్షాలు కురిసినప్పుడు నీరు మొత్తం చెరువుకు పోయేందుకు వీలులేక పొలాలపై పడి భూములు కోతకు గురవుతున్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులు మంజూరు చేసి 2025 ఫిబ్రవరి, మార్చి నెలలో చెరువు కాల్వలు బాగుచేయిస్తానని వారికి హామీ ఇచ్చారు.

రాజ్యాంగ నిర్మాతను అమిత్‌షా కించపరచడం దారుణం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

చిత్తూరు సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా పార్లమెంటులో కించపరిచేలా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ దళితుల పట్ల చిన్నచూపు చూస్తుందనడానికి అంబేడ్కర్‌ను కించపరచడమే నిదర్శనమని చెప్పారు. కూటమి నేతలు కూడా అమిత్‌షా మాటలను ఖండించకపోవడం తగదన్నారు. ఎన్నికల సమయంలో అంబేడ్కర్ ఆశయాలను బతికిస్తానని చెప్పి ప్రజలను ఏమార్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలా కించపరిచేలా మాట్లాడడం దారుణమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పల్లెపల్లెకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేతలు రమేష్, శివకుమార్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లోని కల్యాణకట్టలలో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులను పర్మినెంట్ చేస్తామని జేఏసీ నాయకులు లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలపై కేసులు పెట్టడం అన్యాయమని కాణిపాకం వరసిద్ధుడి ఆలయంలోని కల్యాణకట్ట ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాబు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు నిజానిజాలు పరిశీలించకుండా కేసులు పెట్టడం తగదన్నారు. కాణిపాకం కల్యాణకట్టలో పనిచేస్తున్న క్షురకులెవరూ జేఏసీ నాయకులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. విచారణ జరిపి నిర్దోషులపై కేసు ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు దామోదరం, కె.ప్రభాకర్, ఎ.మురళి తదితరులు పాల్గొన్నారు.

మలుపురోడ్లలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయరూ...!



చిత్తూరు-పెనుమూరు మార్గంలో మోపిరెడ్డిపల్లి వద్ద - పెనుమూరు-నేంద్రగుంట మార్గంలో రాజావారిఇండ్ల వద్ద ప్రమాదకర మలుపులు

పెనుమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనుమూరుకు రోజూ అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచికబోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు వాపోతున్నారు. చిత్తూరు నుంచి పెనుమూరు మార్గంలో బీసీ కాలనీ, రాణావేణుగోపాలపురం, కావూరివారిపల్లి, మోపిరెడ్డిపల్లి, శాతంబాకం, పూనేపల్లిక్రాస్ వద్ద రోడ్డు మలుపులు ఉన్నాయి. పెనుమూరు నుంచి నేంద్రగుంట మార్గంలో గుట్టకిందపల్లి, గోపాలపురం, రాజావారిఇండ్లు, క్యాటిల్‌ఫారం వద్ద రోడ్డు మలుపులు ఉన్నాయి. ఈ ప్రదేశాల్లో ఎటువంటి సూచికబోర్డులు లేకపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అసలే గుంతల రోడ్లతో ఇబ్బందులు ఓపక్క.. మలుపుల రోడ్లతో మరో పక్క వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

వరదరాజస్వామికి

వెండి హస్తాలు, పాదాలు విరాళం



ఈవోకు వెండి హస్తాలు, పాదాలు అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయానికి బెంగళూరుకు చెందిన నవీన్‌కుమార్ ఆదివారం వెండి హస్తాలు, పాదాలు విరాళంగా అందించారు. వెండి ఆభరణాలు కేజీ 800 గ్రాముల బరువు కలిగి రూ.185,000 ఖరీదు చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి సికింద్రాబాద్‌కు చెందిన రాజ్యలక్ష్మి రూ.1,01,116 డీడీ రూపంలో అందించారు. విరాళదాతను ఈవో ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానంతరం దాతలను ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు అన్ని రంగాల్లో ఎదగాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

బంగారుపాళ్యం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని వజ్రాలపురం గంగమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా గౌడ వనభోజన మహోత్సవ కార్యక్రమం మద్దిలేటి కృష్ణమూర్తి గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున గౌడ కులస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాజీ మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం గౌడ కులస్తుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి కూడా అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో తాతా జయప్రకాష్ గౌడ్, సుధాకర్ గౌడ్, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుడిపూడి సత్యబాబు, మహేంద్ర గౌడ్, బుసా నాగరాజ్ గౌడ్, నీరజాక్షులు గౌడ్, జనార్ధన్ గౌడ్, శైలాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకోండి: భీమనేని



మాట్లాడుతున్న భీమనేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఉన్న పాలసముద్రం వాసులందరూ లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు టీడీపీ ఫోరం కమ్మ సంఘం వారిని కోరారు. ఆదివారం బెంగళూరులో పాలసముద్రం వాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 23 మంది లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకుని చిత్తూరు జిల్లాలో మొదటిస్థానంలో ఉన్నామన్నారు. పాలసముద్రం మండలం నుంచి 50 మందితో లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారందరితో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి ఆయనతో కలసి కాఫీ సేవించే అవకాశం కల్పిస్తామన్నారు. ఎక్కువ సంఖ్యలో సభ్యత్వం తీసుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. టీడీపీ నాయకులు వాసు నాయుడు, మాధవ నాయుడు, బి.లోకనాథ నాయుడు, రావిళ్ల లోకేష్, కిషన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులో

మద్యం సీసాల సీజ్

వెదురుకుప్పం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి కాలనీలో ఓ చిల్లర దుకాణంలో ఉన్న ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి కాలనీలోని కె.ఆర్ముగం మద్యం సీసాలు కలిగి ఉన్నాడని అందిన సమాచారం మేరకు ఏఎస్ఐ ఏలుమలైరెడ్డి తమ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వారిని చూసిన ఆర్ముగం పరారయ్యాడు. చిల్లర దుకాణంలో ఉన్న ఏడు క్వార్టర్ మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా ఎక్కువ మద్యం బాటిళ్లు కలిగి ఉండి, ఇతరులకు అధిక ధరలకు అమ్మడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు

గుడిపాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కిల్లారిపల్లె గ్రామంలో పేకాట స్థావరాలపై గుడిపాల పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాఠశాలలో పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.1150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

ఆరు పంచాయతీల్లో సామాజిక తనిఖీలు

పాలసముద్రం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న బృందం ఆదివారం వెంగళరాజుకుప్పం, ఎస్ఆర్‌కండ్రిగ, కోదండరామాపురం, ఆముదాల, పాలసముద్రం, బాలకృష్ణాపురం పంచాయతీ కార్యాలయాల వద్ద ఉపాధి కూలీలు, గ్రామస్థులతో సర్పంచుల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. డీఆర్పీలు అక్కడ జరిగిన అవకతవకల గురించి సమావేశం దృష్టికి తెచ్చారని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఎస్ఆర్పీ మల్లికార్జున్ తెలిపారు. ఈ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీవీరావుకు ఘన నివాళి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నాయకులు పీవీరావుకు జిల్లా మాల మహానాడు సభ్యులు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మేరకు స్థానిక ఎన్జీవో హోం వద్ద నిర్వహించిన పీవీరావు వర్ధంతి వేడుకల్లో ఆయన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునుస్వామి, పార్థసారథి, విజయభాస్కర్, తులసీరామ్, రాజా, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు

క్రీడల్లోనూ రాణించండి

● గల్లా రామచంద్ర నాయుడు



క్రీడాపోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ధనుంజయ నాయుడు



షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థిని

పూతలపట్టు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అమరరాజా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు అన్నారు. పూతలపట్టు మండలం పేటమిట్టలోని మంగళ్ విద్యాలయం ఆవరణలో ఆదివారం విద్యార్థినీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరిక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు పూలబాట వేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ క్రీడాపోటీల్లో దిగువమాఘం, కరకంబాడి అమరరాజా విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గల్లా రాధాకృష్ణ నాయుడు, భానుమూర్తి నాయుడు, గల్లా రామా నాయుడు, అమరరాజా విద్యాసంస్థల సెక్రటరి ఆర్.సతీష్, మంగళ్ విద్యాలయ ప్రిన్సిపాల్ ధనుంజయ నాయుడు, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి మళ్లింపుతో వృథాకు అడ్డుకట్ట



పుల్లూరు వద్ద ఎక్స్‌కవేటర్‌తో వంక నీరు మళ్లింపు

ఐరాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి వృథాగా పోతున్న గార్లేయనది నీటిని ఆదివారం పుల్లూరు వద్ద మేదరమిట్ల మోహన్ నాయుడు వేలాది రూపాయలు ఖర్చు చేసి ఇ.చవట పల్లె గ్రామ పంచాయతీలోని చెరువులకు మళ్లించారు. పంచాయతీ ప్రజలు 20 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నా పని జరగడం లేదని గ్రామస్థులు తెలియజేశారు. ప్రస్తుతం నీటిని మళ్లించడంతో కొండేపల్లె చెరువు, గొల్లోడికుంట, బేరువానికుంట, పాతచెరువుకుంటకు నీళ్లు వెళుతున్నాయన్నారు. త్వరలో ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే మురళీమోహన్ సహకారంతో చెక్‌డ్యామ్‌ను నిర్మిస్తానని మోహన్ నాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర్ నాయుడు, లోకనాథ నాయుడు, దొరబాబు నాయుడు, దేవరాజులు, హరి తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస్‌లో సామూహిక పఠనం



నారాయణ పఠన సేవలో బాలవికాస్ విద్యార్థులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠనాభిరుచి కలిగే విధంగా ప్రతి ఆదివారం నగరంలోని సత్యసాయి బాలవికాస్ కేంద్రాల్లో ఉదయం విద్యార్థులతో నారాయణ సేవా సామూహిక పఠన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. సెలవు రోజుల్లో సెల్‌ఫోన్‌లకు చిన్నారులు అలవాటు పడకుండా బాలవికాస్ కేంద్రాల్లో సామూహిక పఠనాలు, ఆటలు-పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చదువు పట్ల అభిరుచి కలిగే విధంగా బోధన చేస్తున్నామని వారు తెలిపారు.

గణితశాస్త్రం

సైన్స్ అండ్ టెక్నాలజీకి మూలస్తంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలురెడ్డి

వెదురుకుప్పం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రం అన్ని శాస్త్రాలకు మూల స్తంభం వంటిదని, మానవ నాగరికత పురోగతికి ఎంతగానో తోడ్పడిందని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయలురెడ్డి అన్నారు. ఆదివారం ఆ కళాశాలలో గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం జరిగింది. డాక్టర్ ధనంజయరెడ్డి గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీఎస్‌లత, జోతిప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలి

చిత్తూరు సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వడ్డెర్లు టీడీపీతోనే ఉన్నారని స్పష్టంచేశారు. సీఎం చంద్రబాబు వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. వడ్డెర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలో చిత్తూరులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం కులవృత్తులవారికి పనిముట్లు, యంత్రాలు, రుణాలు మంజూరు చేస్తే తమకు చేయూతగా ఉంటుందని విన్నవించారు. జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు, నేతలు హరిబాబు, రుద్రయ్య, కుసుమ, అయ్యప్ప, గణేష్ పాల్గొన్నారు.